క్లుప్తంగా

నాణ్యమైన మందులతో వ్యాధుల నియంత్రణ



తైవాన్ సదస్సులో పాల్గొన్న డాక్టర్ టీవీ నారాయణ

మధురపూడి: సమర్థవంతమైన, నాణ్యమైన ఔషధాల తయారీ ద్వారా మహమ్మారిలను ఎదుర్కోగలమని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ అన్నారు. ఇటీవల తైవాన్‌లోని తైపిలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. ఫెడరేషన్ ఆఫ్ ఆసియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఎఫ్ఏపీఏ) ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లిన నారాయణ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో యువ ఫార్మసీ నిపుణులు, విద్యార్థుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ప్రజల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించే ఔషధాలు ఉత్పత్తి కావాలని ఆకాంక్షించారు. అలాగే కరోనా తదితర మహమ్మారి సంభవిస్తే ఎదుర్కొనేందుకు అవసరమైన పద్ధతులు, మందుల తయారీపై చర్చించారు. సదస్సులో వికాస్ ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుమలత, డాక్టర్ శ్రీలక్ష్మి తదితరులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. వికాస్ ఫార్మసీ కాలేజీ చైర్మన్ తన్నీరు చినసుబ్బారావు వీరికి అభినందనలు తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి



గోకవరంలో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దేవీచౌక్ ఉత్సవ కమిటీ సభ్యులు

గోకవరం: రామాయణ గ్రంథకర్త వాల్మీకి మహర్షి జయంతిని శనివారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. దేవీచౌక్ ఆలయ ప్రాంగణంలో వాల్మీకి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యుడు వరసాల ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణ మహాగ్రంథాన్ని రచించారన్నారు. ప్రతిఒక్కరూ ఈ గ్రంథాన్ని పఠించడం ద్వారా ఆదర్శ కుటుంబ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఇనకోటి బాపన్నదొర, మంగరౌతు శ్రీను, ఇనకోటి పెద్దులు, ఆచంట రాజు, పులపర్తి బుజ్జి, మామిడి అయ్యప్ప, గండ్రెడ్డి నాని, తామర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులకు మరిన్ని వసతులు



రైల్వేస్టేషన్‌లో పర్యటిస్తున్న జెడ్‌యూఆర్‌సీసీ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: రైల్వే ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని జెడ్‌యూఆర్‌సీసీ సభ్యులు పి.శ్రీనివాస ఆచార్యులు, లక్ష్మీనారాయణ జవ్వార్ అన్నారు. వారు శనివారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో పలు విభాగాలను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 4, 5 నంబర్ ప్లాట్‌ఫాంలను పరిశీలించి, 6వ ప్లాట్‌ఫాం అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో స్టేషన్ సీటీఐ సుంకర చంద్రమౌళి పాల్గొన్నారు.

సీస్ పరీక్షను సమర్థంగా నిర్వహించాలి

కంబాలచెరువు: స్టేట్ఎడ్యుకేషనల్ అచీవ్ మెంట్ సర్వే (సీస్) పరీక్షను నవంబర్ మూడున సమర్థంగా నిర్వహించాలని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాలలో శనివారం సీస్ పరీక్షకు ఫీల్డ్ ఇన్ వెస్టిగేటర్లు (నిర్వాహకులు)గా నియమించిన బీఈడీ కళాశాల ఛాత్రోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారికి విధివిధానాలు తెలియచేశారు. పరీక్ష లక్ష్యం, ఇచ్చిన సూచనలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలన్నారు. పరీక్ష అనంతరం పేకింగ్ చాలా జాగ్రత్తగా చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యార్థి, అర్బన్ రేంజ్ ఎంఈవో 2 రమా రజని, సీఆర్పీలు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

ప్రకాశం నగర్: అర్థ శతక గ్రంథ రచయిత ఆర్.పృథ్వీ రచించిన దీర్ఘ కవితా కావ్యం 'అమ్మమ్మ గారి ఊరు' పుస్తకాన్ని శనివారం స్థానిక గౌతమీ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఇంకమ్ ట్యాక్స్ ప్రధాన కమిషనర్ మేడిశెట్టి తిరుమల కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రచయిత పృథ్వీని ఘనంగా సత్కరించారు. అరిపిరాల నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సమతా సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వరి కోతలు.. రైతుల ఆశలు

- ఆశాజనకంగా ఖరీఫ్
- దిగుబడిపై రైతుల ధీమా
- అనుకూలించిన వాతావరణం
- చకచకా కోత పనులు



బలభద్రపురంలో వరిని కోస్తున్న మెషీన్

బిక్కవోలు: నియోజకవర్గంలో ఖరీఫ్ వరికోతలు ప్రారంభమయ్యాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను రైతులు మెషీన్లతో కోయిస్తున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో పంటను ఒబ్బిడి చేసుకునే పనిలో పడ్డారు. రెండు రోజులుగా పక్వానికి వచ్చిన పంట కోత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. చాలా మంది రైతులు యంత్రాలతో కోతలు పూర్తి చేయిస్తున్నారు. గంటల వ్యవధిలో పంట చేతికి వచ్చే అవకాశం ఉండటం వల్ల యంత్రాలలో కోతలు పూర్తి చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

54 వేల ఎకరాల్లో వరిసాగు

నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో సుమారు 54 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. దీనిలో 90 శాతం మేరకు 7029 (స్వర్ణ), మిగిలిన 10 శాతంలో వివిధ రకాలు వేశారు. ముందుగా ఊడ్చిన చేలు పక్వానికి రావడంతో రైతులు కోతలు ప్రారంభించారు. అమావాస్య సెంటిమెంట్ కూడా ఉండడంతో కొంత మంది వెనకకు తగ్గుతున్నారు. సాధారణంగా ఎకరం చేనును కోయడానికి తొమ్మిది మంది కూలీలు అవసరమవుతారు. ప్రస్తుతం పురుషులకు రూ.600, మహిళలకు రూ.400 చొప్పున కూలి చెల్లిస్తున్నారు.

30 నుంచి 40 బస్తాల దిగుబడి

ఖరీఫ్ వరి ఆశాజనకంగా ఉండటంతో రైతులు దిగుబడిపై ఆశలు పెంచుకున్నారు. ఈ ఏడాది తెగుళ్లు తక్కువగా ఉండటంతో పెట్టుబడులు కూడా తక్కువే అయ్యాయి. కనీసం ఎకరాకు 30 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పంట బాగుంది



పంట బాగా పండింది. దిగుబడి కనీసం 35 నుంచి 40 బస్తాలు వచ్చే అవకాశం ఉంది. వాతావరణం ఇలాగే అనుకూలిస్తే వ్యవసాయ పనులు ఊపందుకుంటాయి. వచ్చే నెలాఖరు వరకూ వర్షాలు లేకుంటే రైతులందరూ పంట ఒబ్బిడి చేసుకుని గట్టెక్కుతారు.

– సత్యంశెట్టి రమేష్, కౌలు రైతు, బలభద్రపురం

వాతావరణం అనుకూలం



ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. తెగుళ్ల ఉధృతి కూడా తక్కువనే చెప్పవచ్చు. వరి కోత లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. వ్యవసాయ పనుల్లో రైతులందరూ బిజీగా ఉన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా ప్రభుత్వం ప్రారంభించింది.

– శామ్యూల్ జాన్, మండల వ్యవసాయాధికారి, బిక్కవోలు

రావమ్మా..గౌరమ్మా...



ఊరేగింపుగా వస్తున్న చిన్న గౌరమ్మతల్లి



ఆకట్టుకున్న వేషధారణలు

- గ్రామంలో ఘనంగా అమ్మవారి ఊరేగింపు
- రెండేళ్లకోసారి నిర్వహించి జాతరకు సిద్ధమైన ఊలపల్లి గ్రామం
- విచిత్ర వేషధారణలో గ్రామస్తులు



వాలి, సుగ్రీవుడు, శ్రీరామచంద్రుడు వేషధారణలో కళాకారులు

బిక్కవోలు: రావమ్మా.. గౌరమ్మా అంటూ గ్రామస్తులు అమ్మవారికి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో రెండేళ్లకోసారి నిర్వహించే గౌరీదేవి జాతర ఉత్సవానికి సంబంధించి శనివారం గ్రామంలో వరి దుబ్బులతో అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. వచ్చే నెల 22న గ్రామంలో ఉన్న పెద్ద గౌరమ్మ, చిన్న గౌరమ్మ ఆలయాల వద్ద భారీ ఎత్తున జాతర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారిని గ్రామ పొలిమేర నుంచి బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డప్పులతో, విచిత్ర వేషధారణతో అమ్మవారి పల్లకిలో గ్రామోత్సవం నిర్వహించి అనంతం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఆదివారం నుంచి నవంబరు 22 వరకూ ప్రతి రోజు అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహిస్తారు. జాతర రోజున రెండు ఆలయాల మధ్య పోటీ నెలకొనేలా సంబరం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సంబరానికి గ్రామానికి చెందిన గ్రామస్తులు ఏ ప్రాంతాల్లో ఉన్నప్పటికి ఇక్కడికి తరలివచ్చి పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. పెద గౌరమ్మ ఆలయం వద్ద గౌరమ్మ తల్లిదండ్రులుగా పెనుగొండ గ్రామానికి చెందిన బొడ్డు రవి అప్పారావు, అంజలి దంపతులు వ్యవహరించారు. ఇక్కడ ఆలయం కమిటీ సభ్యులుగా పోతల వీర వెంకట సత్యనారాయణ, యాళ్ల మురళీ సింహాచలం, రొంగల వీర్రాజు ఉంటారు. అలాగే చిన్న గౌరమ్మ ఆలయం వద్ద గ్రామానికి చెందిన కొంచా చరణ్, గంగా దంపతులు అమ్మవారి తల్లి దండ్రులుగా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా పి.రాము, ఎం.శంకరం తదితరులు ఉంటారు. ఈ కార్యక్రమంలోని సర్పంచి బండారు రమ్య, ఎంపీటీసీ బండారు శివ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిలో 'మొక్క'వోని దీక్ష

మొక్కలు పంపిణీ చేసిన నూతన దంపతులు



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులకు మొక్కలు అందిస్తున్న నూతన దంపతులు

బిక్కవోలు: పర్యావరణ పరిరక్షణ మన కర్తవ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం పందలపాక గ్రామానికి చెందిన గుంట్రెడ్డి వీరభద్రరావు, రామతులసి కుమారుడు ఇటీవల వివాహం అనంతరం కొమరిపాలెం గ్రామంలోని కేఎస్‌జే కళ్యాణ మండపంలో రిసెప్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు నూతన దంపతులు అయిన గుంట్రెడ్డి అనిల్ కుమార్, వెంకట సత్యవాణిలకు ఆశీస్సులు అందజేశారు. అనంతరం నూతన దంపతులు ఏర్పాటు చేసిన 500 మొక్కలను వచ్చిన అతిథులకు అందించారు. ఈ కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజి, కొమరిపాలెం ఉపసర్పంచి కొవ్వూరి సత్యానారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ,మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపరపు శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ బోడ్డు ముత్యాలరావు,తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేసిన ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

గోకవరం: మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం శనివారం ఘనంగా జరిగింది. వీరలంకపల్లిలోని రామకృష్ణాగార్డెన్స్‌లో సంఘ గౌరవాధ్యక్షులుగా బాలు, గంధం బుజ్జి, గౌరవ సలహాదారులుగా తోలేటి రాంప్రసాద్, పల్లెల కొండలరావు, మండలాధ్యక్షుడిగా నన్నపు శాంతిబాబు, వైస్ ప్రెసిడెంట్‌గా శివ, సెక్రటరీగా చిన్న లావయ్య, ట్రెజరర్‌గా దుర్గ, జాయింట్ సెక్రటరీగా రతనరాజు ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షుడు శాంతిబాబు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్, దుర్గాప్రసాద్ తదితరులు

పెదపూడి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ విజయభాస్కర్, మండల పరిషత్ విప్ సమ్మంగి దుర్గాప్రసాద్ వాల్మికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ వాల్మికి మహర్షి రాముడి జీవిత చరిత్రను రామాయణ మహాకావ్యంగా రాసి ఆదికవి అయ్యారన్నారు. భారత దేశాన్ని ప్రథమ, ప్రధాన కవిత్వంతో ఏకం చేసిన మహర్షి వాల్మికి అని కొనియాడారు. ఎన్ని ఏళ్లు అయినప్పటికీ వాల్మీకిని మించిన కవి లేడు అని పలువురు భావిస్తారన్నారు. ఎంపీడీఓ విజయ భాస్కర్ మాట్లాడుతూ వేల సంవత్సరాలు తపస్సు చేసిన మహర్షి వాల్మికి అన్నారు. ఆయనే ప్రపంచంలోనే మొట్ట మొదటి కవి అని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ కాంచన, మండల పరిషత్ ఏఓ చలమయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసు, నాగరాజు, సచివాలయం కార్యదర్శి సుంకర వీరస్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సూర్యకాంతం శతజయంతి



సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న అభిమానులు

రాజానగరం: కోడళ్లను హడలెత్తించే అత్తగా వెండితెరను అలరించిన సూర్యాకాంతాన్ని ఆంధ్రులెవ్వరూ మరువలేరని పలువురు వక్తలు అన్నారు. దివాన్ చెరువులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒనుములమ్మ ఆలయం వద్ద సూర్యకాంతం శత జయంతిని ఆమె అభిమానులు శనివారం వేడుకగా నిర్వహించారు. రాధాకృష్ణ ఆలయం కమిటీ అధ్యక్షుడు గారబోయిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. కాకినాడకు చెందిన ఆమె జీవిత విశేషాలు, సినిమాలలోని వివిధ సన్నివేశాలను ప్రస్తావిస్తూ ఆడబాల మరిడియ్య, నీలపాల శివ, పలివెల లక్ష్మణరావు, అంకం మనోహర్‌తో పాటు పలువురు వక్తలు ప్రసంగించారు.

ఢిల్లీకి తరలిన కలశం

మధురపూడి: నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా కోరుకొండ మండలంలోని 22 సచివాలయాల నుంచి సేకరించిన మట్టితో కూడిన కలశం ఢిల్లీకి బయలుదేరింది. ఈనెల 30, 31 తేదీల్లో అమృత వనం, అమరవీరుల త్యాగాలకు ప్రతీకగా ఏర్పాటు చేయబోయే స్థూపంలో దీన్ని వినియోగిస్తారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్ కుమార్ చేతుల మీదుగా కలశాన్ని నెహ్రూ యువకేంద్రం అధికార ప్రతినిధి ప్రదీప్ కుమార్‌కు శనివారం అందజేశారు.

లయన్స్ సేవలు మరింత విస్తృతం



దుప్పటి అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పెదపూడి: గ్రామాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తున్నామని జి.మామిడాడ లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీసూర్య అధ్యక్షుడు కడిమి శ్రీను అన్నారు. గ్రామంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి ఎంవీవీఎస్ఎన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పేదలకు దుప్పట్లు, గొడుగులు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. క్లబ్ ప్రతినిధులు ఛత్రపతి శివాజీ, ఆర్ఏఆర్‌కే చౌదరి, సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖాదీ మహోత్సవ్ పోటీలు

కంబాలచెరువు: ఖాదీ మహోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలను శనివారం స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. 19 మండలాలో 1, 2, 3 స్థానాలలో నిలిచిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాస్ తెలిపారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, జి.ప్రమీలారాణి, విజయదుర్గ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం, నాగరాజా మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ హెచ్ఎం టి.చక్రధర్, ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, విజయ కుమారి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కల్పించాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బాలలకు వారి హక్కులు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించాలని అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం జ్యుడీషియల్, రెవెన్యూ, చైల్డ్ వెల్ఫేర్, పోలీసు అధికారులు, జువెనైల్ జస్టిస్ బోర్డు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు, ప్యానెల్ లాయర్లకు నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్, వారి రక్షణ స్కీమ్ 2015 సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు.

న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ పిల్లలపై అనేక అఘాయిత్యాలను జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు పిల్లలకు వివిధ చట్టాలపై, వారి హక్కుల పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలతో భిక్షాటన, వెట్టిచాకిరీ, బాల్యవివాహాలు అరికట్టడానికి నిరంతరం కృషి చేయాలన్నారు. వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అనాథ పిల్లలు, తల్లిదండ్రుల నిర్లక్ష్యం వల్ల బాధింపబడుతున్న పిల్లల సంక్షేమం వివిధ ప్రభుత్వ శాఖలపై ఉంటుందన్నారు. కార్యక్రమంలో పర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి, మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.విజయ కుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి, అబ్జర్వేషన్ హోం సూపరింటెండెంట్ కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గ్రామాల్లో సురక్ష వైద్య శిబిరాలు



దోమాడలో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అచ్యుతాపురంలో ప్రజలకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పెదపూడి: ప్రజా ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. దోమాడ గ్రామంలో శనివారం సర్పంచి మీనవల్లి శారదదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన వైద్యాన్ని వారి చెంతకే తెచ్చి అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో కోటి 40 లక్షల కుటుంబాలకు ఆరోగ్య సురక్ష ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.ఈ శిబిరంలో 419 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్, తహసీల్దార్ టి.సుబాష్, ఈఓపీఆర్డీ ఎంసత్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు దున్నె అప్పారావు, టేకుమూడి రామకృష్ణ మీనవల్లి శ్రీనువాసు, గుడాల చంద్రరావు, చీపూరి శ్రీను సచివాలయం కార్యదర్శి కృష్ణారెడ్డి, వీఆర్వో గణపతి, పాల్గొన్నారు.

పేదలకు ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం : ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు పైసా ఖర్చు లేకుండా ఖరీదైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని అచ్యుతాపురంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రోగులకు మందుల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్లుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, సర్పంచ్ బత్తుల శ్రీను, ఎంపీటీసీ కొత్తపల్లి చిన్ని, ఆకుల సత్యనారాయణ, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట

బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా లక్షలాది మందికి ఉచితంగా వైద్య సేవలందుతున్నాయని సర్పంచి బుంగా రామారావు అన్నారు. శనివారం బలభద్రపురం గ్రామంలోని జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోని ఈవోపీఆర్డీ బి.భవాని, పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో ఆరోగ్యానికి భద్రత

మధురపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదల ఆరోగ్యానికి మరింత భద్రత లభించిందని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ అన్నారు. కోరుకొండ మండలం నిడిగట్ల గ్రామంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. దోసకాయలపల్లి పీహెచ్‌సీ డాక్టర్ వి.కోటేశ్వరరావు, రాజమహేంద్రవరం కమలాకర్ హాస్పిటల్‌కు చెందిన కార్డియాలజిస్టు చైతన్య కిరణ్, జీఎస్ఎల్‌కు చెందిన వైద్యనిపుణులు శిబిరంలో 430 మందికి వైద్యసేవలు అందించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. ఎంఈవో కుశలవ దొర, డిప్యూటీ తహసీల్దార్ నరేష్, సెక్రటరీ బత్తుల సురేష్ బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బలభద్రపురం వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు



మల్లిపూడిలో రోగులకు ఆరోగ్య కార్డులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్య సేవలు

రంగంపేట: మల్లిపూడి గ్రామంలో సచివాలయం వద్ద ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో పేదలకు ఉచితంగా వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా ఈ వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 619 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, రాష్ట్ర చేనేత, రైతు విభాగం కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ మేడిది చక్రం, పంచాయతీ కార్యదర్శి బి.గౌరీశాంతి, పీహెచ్‌సీ డాక్టర్ జి.రామ్‌భాస్కర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.